క్లుప్తంగా

## విజేతలకు బహుమతుల పంపిణీ



ముగ్గులు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అద్దంకి రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా దేవాలయం ఆవరణలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 20 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. దీనిలో భాగంగా అద్దంకికి చెందిన తన్నీరు ప్రసాద్‌ను పట్టణ ఓబీసీ కార్యదర్శిగా నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ యాదవ్, రాష్ట్ర కిసాన్ మోర్చా సభ్యుడు టీవీఎస్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడి కుటుంబానికి బీమా పంపిణీ



బీమాను అందజేస్తున్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు గ్రామానికి చెందిన రైతు గన్నవరం ఖాదర్‌వలి ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. రైతు కుటుంబ సభ్యులకు ఆదుకునేందుకు వైఎస్సార్ బీమా సొమ్ము రూ. 7 లక్షల చెక్కును మంగళవారం రాత్రి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య రైతు కుటుంబ సభ్యులకు అందజేశారు.

## రోటరీ, ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

చీరాల అర్బన్: రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువారం రోటరీ క్లబ్ నందు సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నట్లు క్లబ్‌ల అధ్యక్షులు ఐ.బాబూరావు, సుభాషిణిలు మంగళవారం తెలిపారు. సంబరాలలో భాగంగా మహిళలకు వంటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు వంటల పోటీలు జరుగుతాయని, పోటీలలో పాల్గొనేవారు స్టౌవ్, గ్యాస్ సిలెండర్, పదార్థాలను వారే తెచ్చుకోవాలన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

## చందలూరులో రీ సర్వే

జే.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు గ్రామ పరిధిలోని రెవెన్యూ సంబంధించిన పొలాల రీ సర్వే జరుగుతున్నట్లు తహసీల్దార్ ఐ. పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో జరిగే రీ సర్వేకి సంబంధించి అధికారులకు గ్రామ రైతులు సహకరించాలని తెలిపారు. రైతులు అందుబాటులో ఉండి ఎలాంటి ఇబ్బందులు లేకుండా దగ్గరుండి రీ సర్వే చేయించుకోవాలని తెలిపారు. ప్రస్తుతం మండలంలోని కోటపాడు, అలవలపాడు గ్రామాల్లో రీ సర్వే పూర్తయినట్లు తెలిపారు.

## కన్నుల పండువగా అయ్యప్పల ఇరుముడులు

కారంచేడు: అయ్యప్ప మాలధారుల ఇరుముడుల కార్యక్రమం మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రం కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన అయ్యప్పస్వామి గుడి ప్రాంగణంలో గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమాలు నిర్వహించారు. గత 40 రోజులుగా ఎంతో కఠినమైన దీక్షలు బూని, తమ ఇష్టదైవం అయ్యప్పస్వామికి తమ మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమానికి అయ్యప్ప స్వాములతో పాటు, వారి కుటుంబ సభ్యులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అనంతరం సద్ది నిర్వహించి శబరిమల యాత్రకు పయనమయ్యారు.

# పారదర్శకంగా సంక్షేమ పథకాలు

● నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న వెంకటేష్

చీరాల: ప్రజా సమస్యల పరిష్కారమే గడప గడపకు మన ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం రాత్రి చీరాల పట్టణంలోని 10వ వార్డులోని పేరాల గొల్లపాలెం సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రతి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాబలంతో మళ్లీ జగనన్నను సీఎంను చేయాలన్నారు. వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనేది సీఎం ఆశయమన్నారు. ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని తగు పరిష్కారం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, 10వ వార్డు కౌన్సిలర్ గోలి స్వాతి, ఆర్‌బికె చైర్మన్ కావూరి రమణారెడ్డి, కౌన్సిలర్లు మల్లెల లలిత, కీర్తి వెంకట్రావు, చీమకుర్తి బాలకృష్ణ, పి.సుబ్బయ్య, కె.యానాదిరావు, తోకల అనిల్, గోలి జగదీష్, షేక్ ఫాతిమా, నాయకులు కోలా శివ, విజయప్రకాష్, కోండ్రు బాబ్జి, టి.సుధీర్, ప్రేమ్‌కుమార్, మల్లెల రాజశేఖర్, గోలి రవి, గోలి గంగాధర్, యాతం మేరిబాబు, బుర్ల వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

# వార్డుల్లో మౌలిక వసతుల కల్పన

● రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం పట్టణంలోని నాలుగో సచివాలయ పరిధిలోని 7వ వార్డులో మొదటి రోజు నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి ఆయా గృహాల్లోని వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ, యువకులను, పెద్దలను, వృద్ధులను పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ పట్టణ సుందరీకరణలో భాగంగా ఇప్పటికే ప్రధాన రహదారుల మధ్యలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో సుందరీకరణ చేసినట్లు చెప్పారు. అలాగే ప్రతి వార్డులో సీసీ రహదారులు, సీసీ డ్రైనుల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. పట్టణంలో మౌలిక వసతులతోపాటు పచ్చదనం కోసం మొక్కలను నాటించే కార్యక్రమాన్ని చేపట్టి ఇప్పటికే అత్యధిక మొక్కలను నాటినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా మార్కు ప్రభుత్వం వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, చంద్రబాబు ఆయన దత్తపుత్రుడు ఏకమైనా రాబోయో ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రతిపక్ష నేత తాను ఇక ఎలాగూ గెలవలేనని ఊతకర్రల కోసం పాకులాడుతున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, పాట్టణ పార్టీ నాయకులు కాకాని రాధాకృష్ణమూర్తి, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, వలంటీర్లు, అధికారులు, పాల్గొన్నారు.

తరువాత శంఖవరప్పాడు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కామిరెడ్డి రామాంజనేయరెడ్డి మాతృమూర్తి ఆదెమ్మ, మండలంలోని మణికేశ్వరం గ్రామానికి చెందిన సింగరకొండరెడ్డి సత్రం చైర్మన్ రామాల కృష్ణారెడ్డి భౌతికకాయాలను సందర్శించి నివాళి అర్పించారు.

# మంత్రులను కలిసిన ఆమంచి



మంత్రి మేరుగు నాగార్జునకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆమంచి కృష్ణమోహన్



మంత్రి కొట్టు సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న ఆమంచి

పర్చూరు: సాంఘిక సంక్షేమశాఖామంత్రి మేరుగు నాగార్జున, దేవదాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొట్టు సత్యనారాయణను పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ విజయవాడలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ నెల 13వ తేదిన నూతలపాడులో జరిగే టీటీడీ శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించినట్లు ఆమంచి తెలిపారు.

## శ్రామికుల హక్కులు కాపాడేందుకు కృషి

చీరాల రూరల్: శ్రామికుల హక్కులను కాపాడేందుకు సీఐటీయూ కృషి చేస్తోందని పట్టణ కార్యదర్శి ఎం. వసంతరావు అన్నారు. బెంగళూరులో సీఐటీయూ ఆల్ ఇండియా మహా సభలు బెంగుళూరులో జరనున్న నేపథ్యంలో మంగళవారం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కార్మిక కర్షక వర్గాలవారి కోసం వారి ప్రయోజనాల కోసం పోరాటాలు చేయడంలో ముందు వరుసలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్. బాబురావు, ఎలిజబెత్ రేఖ, సుధీర్, సుజీవన, మోజెస్, శంకర్, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

## 14న తిమ్మరాజుపాలెంలో ముగ్గుల పోటీలు

పర్చూరు: మండల పరిధిలోని తిమ్మరాజుపాలెం గ్రామంలోని ఊరచెరువు వారి ఆధ్వర్యంలో కమిషనర్ గొల్లపూడి ఆదేశాల మేరకు తిమ్మరాజుపాలెం చెరువు వద్ద ఈ నెల 14వ తేది భోగి పండుగ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఈవో వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.4000, రెండో బహుమతి రూ.2000, మూడో బహుమతి రూ.1000 అందజేయనున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలలో పాల్గొనేవారు మహిళలు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 74163 00138 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

# ఘనంగా గోదాదేవి సారె గ్రామోత్సవం



అమ్మవారి సారె గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం: స్థానిక మండల కేంద్రం చినగంజాం భావన్నారాయణ స్వామి ఆలయం ఆధ్వర్యంలో గోదాదేవి అమ్మవారి సారె గ్రామోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గత 25 రోజులుగా ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు ధనుర్మాసం పురస్కరించుకొని గోదాదేవిని స్తుతిస్తూ తిరుప్పావై పఠనం చేశారు. ధనుర్మాసోత్సవం 26వ పాశురం పఠనం కార్యక్రమంలో భాగంగా మంగళ వారం అమ్మవారికి చీర, చలిపిండి, గాజులు, పసుపు, కుంకుమలతో గ్రామంలోని ముత్తైదువలు అందరూ కలిసి సారె సమర్పించారు. ఇందులో భాగంగా గోదాదేవి అమ్మవారి చిత్రపటం, సారెతో గ్రామంలోని ప్రధానం వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు అళహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో గ్రామోత్సవం అనంతరం పూజాది కార్యక్రమాలు, సారె సమర్పణ, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వలివేటి వెంకట రామానుజం, శివన్నారాయణ, పొట్టి జనార్ధన గుప్త, వలివేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

అద్దంకి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అవిశన జ్యోతి అధ్యక్షత మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

# చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం



కంపోస్టును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వెంకటరావు

చీరాల టౌన్: గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా వినియోగించుకుంటే అదనపు ఆదాయం లభిస్తుందని డీఎల్‌పీవో పీ.వెంకటరావు సూచించారు. మంగళవారం మండలంలోని చీరాలనగర్, కొత్తపాలెం గ్రామ పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో ఎక్కడా చెత్త కుప్పలు నిల్వ ఉండకుండా కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటుగా తడిచెత్త, పొడి చెత్తలను విధిగా సందప తయారీ కేంద్రాలకు తరలించి ఎరువులు తయారీ చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మురళీ బాపూజీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

# శ్మశాన వాటికకు స్థల పరిశీలన



శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బల్లికురవ: శ్మశాన వాటిక ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు చిలకా మధుబాబు బల్లికురవలో ఎస్సీ కాలని వాసులకు శ్మశాన వాటిక కావాలని సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ స్థానిక తహసీల్దార్ సీతారత్నానికి కాపీ పంపి శ్మశాన వాటికకు స్థలాన్ని పరిశీలించి కేటాయించాలని ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే తహసీల్దార్, మండల సర్వేయర్ చంద్ర, వీఆర్వో గురువయ్య బల్లికురవ నుంచి అద్దంకి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు తూర్పు భాగంలో స్థలాలను మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను పరిశీలించి శ్మశాన వాటికకు అనువైన స్థలాన్ని కేటాయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కందుల జగన్నాథం, కందుకూరు పేతురు, చిలకా మధుబాబు ఉన్నారు.

## అకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



కోలాటం చేస్తున్న మహిళలు

చినగంజాం: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు భారతీయం కళార్చన కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం పలు కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ గరల్స్ హైస్కూల్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా జానపద కళామేళలో భాగంగా పూసపాడు యూనివర్సల్ హైస్కూల్, వినుకొండ దత్త వెంకటేశ్వర మహిళా కోలాట సమాజం వారిచే ప్రదర్శనలు నిర్వహించారు. ఇంకొల్లు నివేదిత హైస్కూల్ వారిచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రూరల్ ఎడ్యుకేషన్ సెంటర్ రిషివాలీ స్కూల్ విద్యార్థులచే పంచతంత్రం తోలుబొమ్మలాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

# వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ తిరుమలాదేవి

వేటపాలెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పని చేస్తున్న వైద్యాధికారి ప్రభాకర్ విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని జెడ్పీటీసీ బండ్ల తిరుమలాదేవి అన్నారు. మంగళవారం ఆమె మంగళవారం ఒంగోలులో జరిగిన ప్రకాశం జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలో ఆమె జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ గుంటూరులో నివాసం ఉంటూ ప్రతి రోజు అక్కడ నుంచి వేటపాలెం విధులకు వస్తుంటాడని తెలిపారు. తన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వైద్యశాలకు వచ్చే రోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తుంటాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాపట్ల జిల్లా డీఎంహెచ్‌ఓకి తన ఫిర్యాదు కాపీని పంపించాలని ఆమె కోరారు.

## ముగిసిన రిలే నిరాహార దీక్షలు



దీక్షలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బల్లికురవ: దళితులకు ఇచ్చిన భూములు అన్యాక్రాంతమైనా అధికారులు పట్టించుకోవడం లేదని బాపట్ల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు వాపోయారు. బల్లికురవలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతు నాలుగు దశాబ్దాల క్రితం కూకట్లపల్లిలో సర్వే నంబర్ 290,500 లలో 150 ఎకరాలు కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలకు చెందిన దళితులు 300 మందికి అసైన్డ్ భూమి పట్టాలిచ్చారన్నారు. భూములు అగ్రవర్ణ పెత్తందారుల చేతిలో ఉన్నాయని తక్షణమే నోటీసులతో భూములు ఖాళీ చేయించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

## పీహెచ్‌సీని పరిశీలించిన డీఎంహెచ్‌వో



నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో విజయమ్మ

మేదరమెట్ల: నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని డీఎంహెచ్‌వో విజయమ్మ మంగళవారం పరిశీలించారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో నిర్మించిన భవనాన్ని ఈనెల 13వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని ఆమె తెలిపారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చొరవతో ఆసుపత్రికి కావాల్సిన రూ.50 లక్షల విలువ గల సామగ్రిని వైద్యశాలకు అందజేసినట్లు చెప్పారు. వైద్యశాల భవనాన్ని టీటీడీ చైర్మన్ చేతుమీదుగా ప్రారంభిస్తారని, త్వరలోనే వైద్యశాలను ట్రామాకేర్ సెంటర్‌గా ప్రజలకు వైద్యసేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట ఇస్మాయిల్, జానీ, డాక్టర్ ఎస్‌వీ సుబ్బారావు, రామదాసు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల నిర్వహణలో అలసత్వం వద్దు



ఎండీఎంను పరిశీలిస్తున్న ఎంఈవో

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో ఉపాధ్యాయులు అలసత్వంగా ఉండొద్దని ఎంఈవో ఎంవీ సత్యాన్నారాయణ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం కారంచేడు యజ్ఞశాలపేట ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ప్రతి రోజు సమయపాలన పాటించడంతో పాటు, అసెంబ్లీ నిర్వహించుకోవాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏ అనూష పాల్గొన్నారు.



## హెచ్చరిక

బాపట్ల జిల్లా, వేటపాలెం మండలం, పందిళ్ళపల్లి గ్రామస్తులైన (1) **గుత్తి రామకృష్ణ ప్రసాదు**, (2) **గుత్తి ఎల్లమంద కోటేశ్వర రావు** మరియు (3) **గుత్తి రామమోహన రావు** గార్ల నంజాయిషీపై ఇందు మూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా

దిగువ షెడ్యూలు ఆస్తితో బాటు మరికొన్ని ఆస్తులు లేళ్ళ భద్రయ్య గారి అనంతరం మా క్లయింట్లుకు, వారి కోడలు అయిన **లేళ్ళ వాణి**లకు చెందినవి.

పర్యవసానంగా, దిగువ షెడ్యూలు స్థిరాస్థి యందు, మా క్లయింట్లు మరియు లేళ్ళ వాణి గార్లు సమాన వాటాదార్లు అయియున్నారు. వారిద్దరూ లోగడ వారికి గల ఉమ్మడి ఆస్తిని ది. 30-03-2022న దాక్యుమెంటు నెం. 2898/22 రు ద్వారా క్రియం చేసియున్నారు. కానీ **లేళ్ళ వాణి** గారి భర్త **లేళ్ళ రాజేంద్ర ప్రసాద్‌రావు** గారు జీవించి యుండగా, మా క్లయింట్లుకు, చెందిన ఆస్తిలో వారికి హక్కులు లేకుండా చేయు దురుద్దేశ్యంతో యం.ఆర్.ఓ. (తహసీల్దార్) కారంచేడు, తదితర రెవిన్యూ అధికారులను తప్పు దోవ పట్టించి, పట్టాదారు పాస్ పుస్తకం 1662, ఆయన స్వార్జితంగా సంపాదించుకున్నారు. కానీ అది వాస్తవానికి, పూర్వార్జితపు ఆస్తి.

లేళ్ళ రాజేంద్ర ప్రసాదరావు గారి తదనంతరం పైన చెప్పినట్లుగా మా క్లయింట్లు, లేళ్ళ వాణిలు మిగతా ఉమ్మడి ఆస్తిని జాయింటుగా క్రయం చేసియున్నారు. పాస్‌బుక్‌ను తప్పించియున్నారు. మా క్లయింట్లు సంబంధిత రెవిన్యూ అధికారులందరికీ, మరియు సబ్ రిజిస్ట్రారు ఇంకొల్లుతో సహా పై సత్యమును తెలియపరచి, షెడ్యూలు ఆస్తిని ఏ విధమైన తప్పుడు పత్రాలతో ఎవరికీ క్రయం చేయుటకు వీలు లేదనన్ని మరియు షెడ్యూలు ఆస్తిని, ఆభ్యంతరకర లిస్టులో పెట్టమని కూడా కోరి యున్నారు.

నిజ నిర్ధారణ జరిపి యున్నారు. అయిననూ సదరు లేళ్ళ వాణి అనువారు షెడ్యూలు ఆస్తిని వారి స్వంతమని పూర్తి హక్కులు గలవని, ప్రజలను ప్రలోభపెట్టి, అమ్మ జూపుతున్నారు. కావున యావన్మందిని హెచ్చరించునది ఏమనగా, లేళ్ళ వాణి గారికి, సంపూర్ణ హక్కులు లేవు. వారి మాటలకు లోబడి ఎవరైనా క్రయములు పొందినచో, అవి మా క్లయింట్లును బైండుచేయవు. మరియు చట్ట ప్రకారము చెల్లవు. గమనించవలసినది.

**ఆస్తికి సంబంధించిన వివరములు**

**షెడ్యూలు : అయిటమ్ - 1:** బాపట్ల జిల్లా, ఇంకొల్లు సబ్ రిజిస్ట్రీ, కారంచేడు మండలం, స. నెం. 752రు కొడవలివారి పాలెం, య.2.22ట్లు వెట్ లాండ్‌కు సరిహద్దులు: **తూర్పు** : అయిటమ్ నెం. 1, **దక్షిణం** : కెనాల్ **పడమర** : మందారపు చిన వెంకయ్య గారి తాలుకా భూమి **ఉత్తరం** : దగ్గుబాటి వెంకటేశ్వర్లు గారి తాలుకా భూమి.

**అయిటమ్ - 2:** బాపట్ల జిల్లా, ఇంకొల్లు సబ్ రిజిస్ట్రీ, కారంచేడు మండలం, స. నెం. 751రు కొడవలివారి పాలెం, య. 0.15ట్లు వెట్ లాండ్‌కు సరిహద్దులు: **తూర్పు** : లేళ్ళ బాబురావు గారి భూమి **దక్షిణం** : కెనాల్ **పడమర** : అయిటమ్ నెం. 1 **ఉత్తరం** : దగ్గుబాటి వెంకటేశ్వర్లు గారి తాలుకా తదితరులు భూములు.

**జి.యం. వి.బి. రాజు**, అడ్వకేట్, రాజమహేంద్రవరం. సెల్ : 98483 70855